హైదరాబాద్ వార్త





# వెలగని లైట్లు... ప్రజలకు తిప్పలు

**-గ్రేటర్‌లో అస్తవ్యస్తంగా వీధిదీపాల నిర్వాహణ -అధికారుల అవగాహన లేమితో తప్పని తిప్పలు**



**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** నగరంలోని చాలా వీధుల్లో సాయంత్రం అయితే చాలు చీకట్లు అలుముకుంటున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మోడ్రన్ వీధి దీపాలు అలంకారప్రాయంగా మారాయి. గుంతల రోడ్లపై చీకట్లో ప్రయాణించడం కత్తిమీద సాములా తయారైంది. ఒవైపు ఆధునికీకరణ పనుల్లో భాగంగా రోడ్లు తవ్వడంతో ఎక్కడ గుంతలున్నాయో, ఎక్కడ మ్యాన్‌హోల్ తెరచి ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు వీధుల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. ఓల్డ్‌సఫిల్‌గూడ లాల్‌వాణినగర్, సంతోషిమాతానగర్, మల్లిఖార్జుననగర్, జ్యోతినగర్ తదితర కాలనీల్లోని వీధిదీపాలు సక్రమంగా వెలగక పోవడంతో రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే మహిళలు ఇబ్బందులు పడుతు న్నారు. అలాగే సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి బీకేగూడ వెళ్లే దారిలో ఒక్క దీపం కూడా వెలగడం లేదు. అసలే నిర్మానుష్యంగా ఉండే ఈ రోడ్డులో రాత్రిపూట నడిచి వెళ్లేందుకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అమీర్‌పేట్ డివిజన్ లోని గంగూబాయి బస్తీలో కూడా వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. అలాగే అమీర్‌పేట్, సనతనగర్, బేగంపేట డివిజన్లలోని అనేక చోట్ల నెలల తరబడి విధిదీపాలు పనిచేయకపోయినా పట్టించుకునే నాధుడే లేదు. నిత్యం రద్దీగా ఉండే ఫతేనగర్ ఫ్లైఓవర్‌పైనా ఒక్క దీపం కూడా వెలగడం లేదు. ఫతేనగర్, సనత్‌నగర్, బల్కంపేట వైపు ఇరుకైన వంతెనపై వాహనాలు హెడ్ లైట్ల ఆధారంగానే వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదాలు అధికంగా జరిగే ఈ వంతెనపై గత నాలుగు నెలలుగా దీపాలు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే ఎర్రగడ్డ సనత్‌నగర్ మార్గంలో కూడా వీధి దీపాలు పనిచేయడం లేదు. సనత్ నగర్‌లోని కంజర్ల లక్ష్మీ మ్నారాయణ పార్కు, పారి శ్రామిక పార్కులో కూడా విద్యుద్దీపాలు వెలగడం లేదు. ఈ పార్కుల్లో సెల్‌ఫోన్ వెలుగులో వాకింగ్ చేపట్టాల్సి వస్తోంది. సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటికలో రాత్రిపూట మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాలంటే సెల్‌ఫోన్‌లైట్లు ఆధార మవు తోంది.అలాగే జగద్దిరిగుట్ట రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ ప్రధాన రహదారి ప్రమా దాలకు నిలయంగా మారుతుంది. రాత్రి పూట వీధిదీపాలు వెలగక ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. నెలరోజులకు పైగా ఈ పరిస్థితి ఉన్నా మున్సి పల్ అధి కారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే భైరతా బాద్ తుమ్మలబస్తీ, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల రోడ్, నాసర్ స్కూల్ రోడ్లలో కొన్ని నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. సాయంత్రం అ య్యిందంటే అంధకారం నెలకొంటోంది. చీకట్లో పాదచారులు, వాహనదారులు ప్రయాణించేందు కు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా వీధికుక్కల బెడద కూడా ఉండటంతో చీకట్లో అవి పాదచారులపై దాడి చేస్తున్న సందర్భాలు ఉన్నా యి. ఆల్విన్ కాలనీ డివిజన్ జన్మభూమి కాలనీ లోనూ హైమాస్ట్ దీపాలు సరిగా వెలగడం లేదు. నాలుగు దీపాల్లో ఒకటే వెలుగు తుండటంతో చీకట్లు అలుము కుంటున్నాయి. విద్యుత్తు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నా రు. దీనిపై స్థానిక అధికారులను సంప్రదిస్తే స్ట్రీట్‌లైట్ల విభాగంలో సామగ్రి కొరత వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతూ వస్తున్నారు.అలాగే వీధి దీపాల విభాగం నిర్వహణను చేపట్టిన ఏజె న్సీ రద్దు కావడంతో జీహెచ్‌ఎంసినే అధికారులు ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారని తెలు పుతున్నారు.

**అవగాహన లేమితో అధికారులు..**

సాధారణంగా జిహెచ్‌ఎంసికి నమోదయ్యే ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం స్ట్రీట్ లైట్ ల మీదనే వస్తుంటాయి. స్ట్రీట్ లైట్ ల నిర్వహణ సజావుగా ఉండటం కోసం ప్రభుత్వాలు, బ్యూరో అఫ్ ఎనర్జీ ఎఫిసియన్సీ వంటి సంస్థలు ఎంతగా తోడ్పాటు అందించినా నగరంలోని బస్తీలు, కాలనీలల్లో వెలుగులు ఇయ్యలేక పోతున్నాయి. అన్నివున్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ పై అవగాహన లేని జెన్‌కో అధికారులను డెప్యూటేషన్ లో ఉంచడం వలన మంచి ఫలితాలు రావడం లేదు. వాస్తవానికి గ్రేటర్ హైదరాబాద్ నగరంలో స్ట్రీట్ లైట్ ల నిర్వహణ మరమ్మత్తు కోసం విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో పనిచేసే అధికారులను జిహెచ్ ఎంసిలో నియమిస్తారు. డిస్కంల పరిధిలో వుండే లోటెన్షన్ నెట్‌వర్క్ నుండి స్ట్రీట్ లైట్ లకు కనెక్షన్ ఇస్తారు. డిస్కం లో చేసే విద్యుత్ అధికారులకే దాని మీద పట్టు ఉంటుంది. కానీ దీనికి భిన్నంగా, జెన్‌కోకు చెందిన కొత్త గూడెం, రామగుండం వంటి ప్లాంట్లలో పనిచేస్తున్న అధికారులను డెప్యూటేషన్‌పై ఇక్కడికి తీసుకొచ్చారు. దీంతో అధికారులపై అవగాహన లేకపోవడంతో ఫిర్యాదులపై పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పైగా జెన్‌కోనుంచి వచ్చిన ఏడిఈ స్థాయి అధికారిని ఇంచార్జి ఎస్ఈగా జిహెచ్‌ఎంసి నియమించింది. ఇందుకు కారణం సదరు అధికారి కుటుంబ సభ్యులు జిహెచ్‌ఎంసిలోని ఓ ఉన్నతాధికారికి స్నేహితుడు కావడం వల్లే ఏమిచేయలని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇటీవల జెన్‌కో యాజమాన్యం సైతం డెప్యూటేషన్‌లో వున్న అధికారులను తిరిగి తమ సంస్థకు బదిలీ చేయాలని,వెనక్కి పంపాలని పలు మార్లు జిహెచ్‌ఎంసికి విజ్ఞప్తి చేస్తున్నా వారిని రిలీవ్ చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# హైదరాబాద్ జూకు ఆడ జిరాఫీ

**-మైసూరు జూ నుంచి తరలించేలా ఏర్పాట్లు**
**-ఇప్పటికే గుజరాత్ నుంచి మూడు జీబ్రాలు రాక**





**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త**

నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కు త్వరలో లేడీ జిరాఫీని తీసుకురానున్నారు. ఇప్పటికే గుజరాత్ నుంచి తీసుకొచ్చిన మూడు జీబ్రాలను ఎన్ క్లోజర్ లోకి తీసుకొచ్చి సందర్శకులకు అందుబాటులో ఉంచారు. వీటిని గుజరాత్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా జంతు మార్పిడి కింద 20 మూషిక జింకలకు బదులుగా వంటారా విభాగమైన రాధాకృష్ణ ట్రస్ట్ నుంచి తీసుకొచ్చారు. కాగా, 35 ఏండ్ల తర్వాత జీబ్రాలు రావడంతో నెహ్రూ జూ పార్కు కళకళలాడుతున్నది. ప్రస్తుతం జూకు మూడు జీబ్రాలను తీసుకురాగా.. ఇందులో రెండు ఆడ, ఒక మగ ఉన్నాయి. అంతే కాకుండా, త్వరలో మైసూరులోని జూ నుంచి ఆడ జిరాఫీని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడి నుంచి జిరాఫీని తరలించడంతోపాటు దానికి బదులుగా రైనోను ఇవ్వనున్నారు. జిరాఫీ తన పొడవైన మెడ, దట్టమైన మచ్చలతో జూకు కొత్త అందాన్ని తీసుకురానున్నది. ప్రస్తుతం జూలో మగ జిరాఫీ సన్నీ ఒంటరిగా ఉంటున్నది. దీనికి జతగా ఆడ జిరాఫీని తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

**ఆరోగ్యం, ఆహారంపై ఫోకస్..**

ప్రస్తుతం నెహ్రూ జూలో 199 జాతుల జంతు, పక్షి జాతులున్నాయి. ఇందులో 1,361 పక్షులు, 328 పాములు, 518 ఇతర జంతువులు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. కొత్తగా వచ్చే జంతువులతో వీటి సంఖ్య మరింత పెరగనున్నది. కాగా, జూ అధికారులు జంతువుల ఆరోగ్యం, ఆహారంపై స్పెషల్ ఫోకస్ పెట్టి వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతి జంతువు ఆరోగ్యానికి అనుగుణంగా ప్రత్యేక మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రతి జంతువు ఆరోగ్యం, బ్రీడింగ్ అవసరాలకు అనుగుణంగా మెనూ రూపొందిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పశువైద్యుల బృందం నిరంతరం జంతువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నది.

# 'మీరేం పరిశీలించారు'

**-వైరల్‌గా మారిన సిపి సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో**



**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త**

నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. 'మీరేం పరిశీలించారు' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియోకు నెటిజనుల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి.. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ గ్యాప్ నుంచి మరో వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా వేగంగా దూసుకొచ్చిన టెంపో అతడిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తన స్కూటర్‌తో సహా రోడ్డుపై పడిపోయాడు.టెంపో వెనుకే వచ్చిన మరో స్కూటరిస్ట్ కూడా కిందపడబోయి తమాయించుకున్నాడు. ద్విచక్రవాహనదారులు ఇద్దరూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ వీడియోనే సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేసి.. 'మీరేం పరిశీలించారని' అడిగారు. బాధ్యతతో కూడిన డ్రైవింగ్, ఎల్లప్పుడు భద్రతే ముఖ్యం, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడండి అంటూ హ్యాష్ ట్యాగ్స్ జత చేశారు. అయితే ఈ ప్రమాదం హైదరాబాద్‌లోని ఏ ప్రాంతంలో జరిగిందన్న వివరాలు వెల్లడించలేదు.ఈ వీడియోపై నెటిజనులు స్పందించారు. ఈ ప్రమాదంలో రెండు వైపులా తప్పు ఉందని అభిప్రాయపడ్డారు. స్కూటరిస్ట్ నిర్లక్ష్యంగా రోడ్డు దాటే ప్రయత్నం చేయగా, టెంపో డ్రైవర్ నియంత్రించలేని వేగంతో ప్రమాదానికి కారణమయ్యాడని పేర్కొన్నారు. స్కూటరిస్ట్, టెంపో డ్రైవర్ ఇద్దరూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు."ఇలాంటి ఘటనలు ప్రతిరోజూ చూస్తుంటాం. పోలీసులు కూడా వారిని చూస్తారు, కానీ పట్టించుకోరని ఓ నెటిజన్ వ్యాఖ్యానించారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరమైన ఖాళీలు లేకుండా చూడాలని, డివైడర్ల సైజు పెంచాలని మరొకరు సూచించారు. షార్ట్‌కట్లతో ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని పలువురు హితవు పలికారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బీ శాఖ సహాయంతో హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు..సెమినార్లు, వీడియో సెషన్లు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. బాధ్యతారహిత డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల గురించి హెచ్చరికలు జారీ చేయాలన్నారు. డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా కోర్సు ప్రవేశపెట్టి బోధించాలని ఓ నెటిజన్ సూచించారు.

ద్విచక్ర వాహనదారులే ఎక్కువ..మన దేశంలో ఏటా లక్షలాది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం.. 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,97,871 మంది ప్రాణాలు కోల్పోయారు. 4,51,228 మంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా (45.80శాతం) ఉన్నారని నివేదిక వెల్లడించింది. అతివేగం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు (61.4శాతం) జరుగుతున్నట్టు ఎన్‌సిఆర్‌బి తెలిపింది.

# అవినీతి రహిత సమాజమే లక్ష్యం

**-అగ్రికల్చర్ యూనివర్సిటీలో విజిలెన్స్ అవగాహన సదస్సు**



**అత్తాపూర్ అక్టోబరు30, ప్రభాతవార్త :** అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతగా కృషి చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025లో భాగంగా డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఫోర్స్‌మెంట్ శిఖా గోయెల్ ఆదేశాల మేరకు హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఇన్ఫోసిమెంట్ ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ... విజిలెన్స్ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని మెరుగైన సమాజం కోసం అందరూ పాటుపడాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అవినీతిరహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం విద్యార్థిని విద్యార్థుల బాధ్యత అని ప్రతి ఒక్కరూ విజిలెన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం గోవర్ధన్ మాట్లాడుతూ విజిలెన్స్ యొక్క ప్రాముఖ్యతను మరియు విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి మాటాడుతూ... ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడడం, సంక్షేమ పథకాలు ప్రజలకు సరైన రీతిలో అందించటం విజిలెన్స్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులతో వారి భవిష్యత్తు ప్రణాళికల పై ముచ్చటించారు. దేశ భవిష్యత్తు భావితరాల మీద ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ విజిలెన్స్ శాఖకు సహకరించాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడ్డాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. రామి రెడ్డి , విజిలెన్స్ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల భద్రతకు జీహెచ్‌ఎంసీకొత్త యాప్..

**హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:**

నగర రోడ్ల భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా జీహెచ్‌ఎంసీ మరో కీలక అడుగు వేసింది. ఫీల్డ్ ఇంజనీర్లు ప్రత్యక్షంగా రోడ్ల పరిస్థితిని పరిశీలించి, సమాచారాన్ని తక్షణమే అప్‌డేట్ చేయడానికి..పీరియాడిక్ పబ్లిక్ సేఫ్టీ ఇన్స్పెక్షన్ యాప్..ను తీసుకువచ్చారు. ఈ యాప్‌ను ఫీల్డ్ మ్యాప్స్ టెక్నాలజీతో రూపొందించారు. ఈ మొబైల్ యాప్ ద్వారా ఇంజనీర్లు పోత్‌హోల్స్, ఓపెన్ మాన్‌హోల్స్, ప్రోట్రూడింగ్ బార్స్,స్టోన్స్, ఫుట్‌పాత్‌లలో ఓపెన్ ఎలక్ట్రికల్ బాక్స్‌లు, సరిగా లేని బ్యారికేడింగ్ వంటి సమస్యలను గుర్తించి జియో ట్యాగ్ ఫోటోలతోపాటు తక్షణ నివేదికలను అప్‌లోడ్ చేయవచ్చు.ఈయాప్‌తో రియల్‌టైమ్ ట్రాకింగ్, వేగవంతమైన తనిఖీలు, అలాగే పారదర్శక రిపోర్టింగ్ వ్యవస్థ ద్వారా బాధ్యతాయుతమైన మానిటరింగ్ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.





# ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ట్రాఫిక్ మళ్లింపు.. ప్రజలకు ఇబ్బందులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మేడ్చెల్, ప్యాట్నీ జెబిఎస్ మీదుగా శామీర్‌పేట్ వరకు చేపట్టనున్న (2 ) ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలు చేపట్టడం వల్ల గురువారం నుంచి ట్రాఫిక్ అంక్షలను విధించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్‌హెచ్ 44సికింద్రాబాద్ ..బోయిన్‌పల్లి బాలనగర్, బాలంరాంయి, జూబ్లీ బస్ స్టేషన్ పరిసర ప్రాంతాల వైపు వెళ్లే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించేందుకు విధులు నిర్వహిస్తున్న పోలీసులు కూడా వాహన చోదకులతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# తండ్రి పంచమకర్మకు హాజరై వెళ్తున్న కూతురు మృతి

**-బాటసింగారం-మజీద్‌పూర్ గ్రామాల మధ్య వరద ఉధృతికి కొట్టుకుపోయిన దంపతులు**
**-భర్తను కాపాడిన స్థానికులు- అప్పటికే భార్య మృతి**

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త :**

ఇటీవల మృతిచెందిన తన తండ్రి పంచమ దినకర్మకు హాజరై భర్తతో కలిసి ఇంటికి వెళ్తున్న ఓ మహిళ వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... యాదాద్రి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన రాచ కృష్ణవేణి (45) తన భర్త ప్రభాకర్‌తో కలిసి ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామంలో గత శనివారం మృతిచెందిన తన తండ్రి, మాజీ సర్పంచ్ రవీందర్ పంచమ కర్మ కార్యక్రమం గురువారం నెర్రపల్లి గ్రామంలో జరగగా హాజరైంది. సాయంత్రం తన భర్త ప్రభాకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తిరుగు ప్రయాణంలో మజీద్‌పూర్-బాటసింగారం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వరద కాలువను దాటే క్రమంలో కృష్ణవేణి చేతిలో ఉన్న బ్యాగు జారి కింద పడడంతో దానిని పట్టుకునేందుకు యత్నిస్తున్న క్రమంలో భార్యాభర్తలిద్దరూ నీటిలో కొట్టుకుపోయారు. వీరిని గమనించి స్థానికులు ప్రభాకర్‌ను సురక్షితంగా బయటకు తీయగా కృష్ణవేణిని బయటకు తీసేలోపే మృతిచెందింది. ఈ విషయాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారు. పోస్టుమార్టం నిమిత్తం కృష్ణవేణి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికీ తరలించారు. కాగా ఐదు రోజుల వ్యవధిలోనే తండ్రి, కూతురు మృతిచెందడంతో నెర్రపల్లి గ్రామంతో పాటు నందనం గ్రామాల్లో విషాధచాయలు నెలకొన్నాయి.

# నేడు శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయ పునఃప్రారంభం

**-జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ కుంభాబిషేకానికి సర్వం సిద్ధం**
**-ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న ముగ్గురు పీఠాధిపతులు**
**-సాయంత్రం 3 గంటల తర్వాత స్వామి వారి సర్వదర్శనం**



పునర్మిర్మాణం పూర్తయిన శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయం

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం పునఃప్రారంభానికి సిద్ధమైంది. జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. కంచి కామ కోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయరు స్వామిలతోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, దేవదాయశాఖ ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. శుక్రవారం ఉదయం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం సాయంత్రం 3 గంటల తర్వాత నుంచి స్వామివారి సర్వదర్శనం భక్తులకు అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ ఈఓ కొడకండ్ల రాజేష్ కుమార్, కమిటి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావులు తెలిపారు. దేవదాయశాఖ అనుమతులు మంజూరు చేయడంతో 2022 ఆగస్ట్ 4వ తేదిన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతీస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయాన్ని 1968 సెప్టెంబరు 6వ తేదిన అప్పటి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి ప్రారంభించారు. పునర్నిర్మాణ ఆలయాన్ని సుమారు ఆరు దశాబ్ధాల తర్వాత ఇప్పటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి ప్రారంభించడం విశేషం. ఎనిమిది ఆలయాల సమాహారం... శ్రీగిరి వెంకన్నస్వామి ఆలయ ప్రాంగణాన్ని ఎనిమిది ఆలయాల సమాహారంగా తీర్చిదిద్దారు. ప్రధానమైన పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి, సుదర్శన నారసింహస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలతోపాటు నూతనంగా కుబేర జ్ఞాన దక్షిణామూర్తి, సీతారామచంద్ర స్వామి ఆలయాలను నిర్మించారు. భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునేలా వాయు శివలింగాన్ని ప్రతిష్టించారు. భద్రాచలం ఆలయ నమూనాలో వైకుంఠరాముడు ఇక్కడ దర్శనమిస్తాడని, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి, తమిళనాడులోని తిరువత్తియార్‌లో మాత్రమే దక్షిణామూర్తికి ప్రత్యేక ఆలయం ఉందని, తెలంగాణలో ఇదే మొదటి ఉపాలయమని, ఇక్కడ కుబేర దక్షిణామూర్తి, స్కందమాత, గణపతి, నందీశ్వరుడు, స్పటికలింగం, నవగ్రహదేవతల విగ్రహాలను ప్రతిష్టించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేయి టన్నుల కృష్ణశిలలతో.... వేయి టన్నుల కృష్ణశిలలతో ఆలయాన్ని పూర్తిస్థాయి రాతి కట్టడంగా మలిచారు. ఆయా ఆలయాల గోపురాలు కూడా కృష్ణశిలలతోనే నిర్మించడం విశేషం. ప్రధాన గోపురం ఎత్తు 33 అడుగులు, భూపాలపల్లి అడవిలో లభ్యమైన నారవేప వృక్షంతో 55 అడుగుల ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేశారు.ఆయా దేవతామూర్తుల మూల విరాట్‌లను మహాబలిపురంలో రూపొందించి, ప్రత్యేక వాహనాల్లో ఇక్కడకు తెచ్చారు. ఆధ్యాత్మిక భక్తిభావాన్ని పెంపొందించేందుకే ఆగమశాస్త్ర ప్ర కారం ఆలయ పునర్నిర్మాణం చేపట్టామని, ప్రజ లు, భక్తులు,ఆధ్మాత్మికవేత్తలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.



శిల్పకళాచారుత్యం ఉట్టిపడేలా ఆలయ లోపలిభాగం



ప్రత్యేకంగా నిర్మించిన యాగశాల

## రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలి : ఏసిపి రమేష్



ఖార్కానా పోలీస్ స్టేషన్‌లో రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఏసీపీ రమేష్ సిఐ అనురాధ

**కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలని తిరుమలగిరి ఏసీపీ రమేష్ తెలిపారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఖార్కాన పోలీస్ సేటషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు అనురాధ (ఖార్కాన), నాగరాజు (తిరుమలగిరి), రవికుమార్ (బొల్లారం)లతో పాటు సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలి

-ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



బాలంరాయి వద్ద ట్రాఫిక్ సమస్యలను పర్యవేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, అడిషనల్ డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ ఎండిఏ అధికారులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాల పట్ల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా గురువారం నుంచి ట్రాఫిక్ అంక్షలను విధించడంతో వాహనాలను దారి మల్లీస్తున్న తీరు తెన్నులు, ట్రాఫిక్ అంక్షలను పర్యవేక్షిచారు. ట్రాఫిక్, హెచ్‌ఎండిఏ ఉన్నతాధికారులతో ట్రాఫిక్ అంక్షలు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పనుల అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ వాహన దారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురౌతాయని, అందుకు ప్రజలు సహకరించాలన్నారు. బాలంరాయి చౌరస్తా నుంచి అన్నా నగర్ చౌరస్తాలలో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతాయని, దీంతో ఆ వైపు వెళ్లే బస్తీ వాసులకు ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ డీఈ విద్యా సాగర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజేశ్ యాదవ్, వి.నరేశ్, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేరుకు పోయిన చెత్త తొలగింపు

### (వార్తా ప్రభావం)



ప్రకాశంనగర్ పాత రిజిస్ట్రేషన్ ఆఫీసు మార్గంలో రోడ్డుపై పేరుకున్న చెత్తను తొలగించిన దృశ్యం.

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాశంనగర్ పాత రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు వెంట చెత్త పేరుకు పోవడంపై ఈ నెల 29 హైదరాబాద్ వార్త మినీలో ,బేగంపేట లో పడకేసిన పారిశుధ్యం,అనే కథనం ప్రచురితమైంది.ఈ కథనం పై స్పందించిన జీహెచ్‌ఎంసీ పారిశుధ్య అధికారులు పేరుకు పోయిన చెత్త ను తొలగించారు.దీంతో సమీప నివాస గృహాల వారు సంతోషం వ్యక్తం చేసారు. ఎంతో కాలంగా పేరుకు పోయిన చెత్త కుప్పలను తొలగించడంతో వారు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం చేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నేతలు

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ఈ నెల 6న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ గారి మీద షూతో దాడి చేసిన దుండగుడిపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో నవంబర్ 1న హైదరాబాదులో జరిగే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి కుల మతాలకతీతంగా వేలాదిగా తరలి రావాలని కోరుతూ పార్సిగుట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర ప్లకార్డులతో ఎమ్మార్పీఎస్ నేతలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్, చెండేటి వేణుగోపాల్ మాదిగ, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు చల్లగూడెం దేవేందర్, దావా శివప్రసాద్, ఎడ్ల రుద్ర, వినయ్, గోనె శ్రీనివాస్, గసగంటి విజయ్, కాశీనాథ్, శ్రీనివాస్, హోలీయ, రవి, బాబు రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు

## నష్టపరిహారం చెల్లించాలనే సుప్రీం కోర్టు ఆలోచన అభినందనీయం

తెలంగాణ అడ్వకేట్ జెఏసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** ఒక నిర్దోషి శిక్షకు గురైతే, అతనికి నష్టపరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు ఆలోచన చేయటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశంలోని పౌరులకు నష్టం, కష్టం, అగౌరవాలు కల్గినప్పుడు నష్టపరిహారాలు పొందేందుకు రాజ్యాంగం కల్పించిన వ్యవస్థలు ఉన్నాయికానీ, తప్పు చేయకుండా, తప్పుడు అభియోగాలతో శిక్షపడి, జైలు పాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే వ్యవస్థ ఇప్పటి వరకు లేదని, అలాంటి వ్యక్తులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలించటం శుభపరిణామమని అన్నారు. ఒక పౌరుడిని వ్యవస్థ బలిపశువును చేసి, తప్పుడు సాక్ష్యాలతో శిక్ష పడేవిధంగా చేస్తే, ఆ వ్యక్తి నిర్దోషిగా బయటకు వచ్చినప్పటికీ, జైలులో అతను కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణలోకి తీసుకుని, తగు మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు యోచిస్తోందని తెలిపారు. సుప్రీం బెంచ్ కోరినప్పుడు ప్రభుత్వం స్పందించి, ఒక వ్యవస్థను ఏర్పాటుచేయవలసిన అనివార్యత ఉన్నదని, ఆదిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయిన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రికి సమస్యలు వివరిస్తున్న అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ తదితరులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సభ్యులు కేంద్రమంత్రిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. సికింద్రాబాద్‌లో బిల్డర్‌లు అప్పులు తెచ్చి భవనాలు నిర్మింస్తే నిబంధనల పేరుతో విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే నిర్మించిన భవనాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నోచుకోవడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అప్పులు తీర్చలేకపోతామని వివరించారు. వడ్డీటు కట్టలేక నానా అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. మురికి వాడల ప్రాంతాలు అధికంగా ఉన్న సికింద్రాబాద్‌లో వంద, రెండు వందల గజాలకు మించిన స్థలాలు లేవని, కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నవారు ఇండ్లు నిర్మించుకోలేక తమను ఆశ్రయిస్తున్నారన్నారు. నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతుండడం వల్ల నిర్మాణాలు జరుపుకోలేక అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. సమస్యలు విన్న మంత్రి కిషన్‌రెడ్డి త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపినట్లు అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ తెలిపారు.

## రక్తదానం చేయండి..ప్రాణదాతలు కండి..

.బేగంపేట ఎసిపి గోపాలకృష్ణమూర్తి



బేగంపేట పోలీసుస్టేషన్ లో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ.చిత్రంలో సీఐ.ఎస్సై లు.

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త.**

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అంటూ బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు.పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం బేగంపేట పోలీసుస్టేషన్ ఆవరణలో ఏసీపీ గోపాల కృష్ణమూర్తి నేతృత్వంలో ఇన్స్‌పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేసారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వారిని ఆదర్శంగా తీసుకుని విధి నిర్వహణలో ముందుకు సాగాలన్నారు. యువత ఇలా స్వచ్చందంగా రక్తదానం చేసి తలసేమియా బాధితులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఇన్స్‌పెక్టర్ సైదులు మాట్లాడుతూ ఒక్క పిలుపుతో స్పందించి రక్తదానం చేసిన యువతను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు.రక్తదానం చేసిన వారికి ఏసీపీ, ఇన్స్‌పెక్టర్లు సర్టిఫికెట్లు ప్రధానం చేసారు.కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై శ్రీధర్,శ్రావణ్,గౌతమి,పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం : మేనేజర్ కృష్ణ రెడ్డి

**అత్తాపూర్ అక్టోబర్ 30 ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ డిపో లో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ కృష్ణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ... రాజేంద్ర నగర్ మండల ప్రజలకు శుక్రవారం (నేడు) ఉదయం 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను డిపో మేనేజర్ కు సెల్ నెంబర్ 99 59226135 లో తెలియజేయాలని కోరారు.

## బోయిన్‌పల్లిలో రక్తదానం : ఎసిపి



బోయిన్‌పల్లి పీఎస్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏసీపీ గోపాల క్రిష్ణ, సిఐ తిరుపతి రాజు

**కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లిలో పోలీస్ అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బేగంపేట ఏసీపీ గోపాల క్రిష్ణ, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ఎన్.తిరుపతి రాజులు ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు.

## సీ.ఎస్.ఐ. పిజీ కళాశాలలో...



ఈస్ట్ మారేడ్‌పల్లి సీ.ఎస్.ఐ.కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏసీపీ సుబ్బయ్య

**అడ్డగుట్ట, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** పోలీసుల అరుమర వీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లిలోని సీ.ఎస్. ఐ. పిజీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తుకారంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, మారేడ్‌పల్లి డిఐ శ్రీశైలం నాయక్‌లు పాల్గొన్నారు. రెజిమెంటల్ బజార్‌లోని జీవదార వాలెంటరీ బ్లైడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి వేణు రక్తదానం సేకరించారు.

## మైనారిటీ ఓట్ల కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి : సాయిబాబా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** కేవలం మైనారిటీ ఓట్లు రాబట్టుకోవటం కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ప్రకటించారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో పోటీ చేయటానికి పనికిరాడని ఎమ్మెల్సీ ఇచ్చి చేతులుదులుపుకున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఎన్నికలలో లబ్ధిపొందాలనే ఉద్దేశ్యంతో ఆఘమేఘాల మీద అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీగా ఎన్నుకునే ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, గవర్నర్ ఆమోదం రానప్పటికీ అజారుద్దీన్‌ను క్యాబినెట్లోకి తీసుకోవటం, తద్వారా మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ మేలు చేసిందని ప్రచారం చేసుకుని, మైనారిటీల ఓట్లు కొల్లగొట్టాలని ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు.నిజంగా కాంగ్రెస్‌కు మైనారిటీలపై చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి, సీనియర్ నేత షబ్బీర్ అలీ ఉండగా, ఆయనను పక్కకు పెట్టి, ఇప్పుడు మైనారిటీలపై లేని ప్రేమను ఒలకబోస్తున్నారని, దీనిని మైనారిటీ నాయకులు గుర్తించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, భానుప్రకాష్, కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మూడేళ్లు జైలు శిక్ష...

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త**

బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బాలిక బంధువు బత్తుల వినోద్ కుమార్(38)కి న్యాయమూర్తి మూడేళ్ల కఠిన కారాగారా శిక్ష,రూ 5000లు జరిమానా విధించినట్లు బేగంపేట ఇన్స్‌పెక్టర్ సీహెచ్ సైదులు తెలియజేసారు.2022లో బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని బాలంరాయి పరిధిలో నిందితుడు మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.ఈ ఘటన లో నిందితునికి నాంపల్లి ప్రత్యేక నేరాల విచారణ కోర్టు న్యాయమూర్తి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ 5000లు జరిమానా విధించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలియజేసారు.

## పోలీసు గ్రౌండ్‌లో వాకర్స్ కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే రాజాసింగ్



ఎమ్మెల్యే రాజాసింగ్ వినతి పత్రం అందచేస్తున్న గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డి.గోపాల్‌జీ

**గోషామహల్, అక్టోబర్ 30ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో తాతలు,ముత్తాతాతల కాలం నుండి గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్ చేయడం జరుగుతుందని,అందుకు గోషామహల్‌పరిసర ప్రాంతాల ప్రజలకు పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,డిజిపిలకు గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో ప్రతినిధులు డి.గోపాల్‌జీ, రాజ్‌కుమార్, టి. సంజయ్,నరేష్‌సింగ్, కన్నయ్యలాల్ యాదవ్‌లు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి,బండి సంజయ్,ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌లను కలిసి గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో స్థానిక ప్రజలకు వాకింగ్ కోసం చిన్నపిల్లల పార్క్,వాకింగ్ ట్రాక్, జీమ్ వాకింగ్ చేయడం కోసం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు తెలిపారు.33 ఏకరాల ప్రభుత్వ స్థలంలో 21 ఏకరాలు ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కొరకు ఇచ్చినట్లు తెలిపారు.మిగతా 11 ఏకరాల స్థలాన్ని పోలీస్ విభాగం ఆధీనంలో ఉంది.గతంలో గోషామహల్ నియోజకవర్గం ప్రజలే కాకుండా పాతబస్తీ నుంచి కూడా ఉదయం,సాయంత్రం వేళ్ల పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్,వ్యాయం చేసే వారని,అంతేకాకుండా వాలీబాల్,షటీల్,టెన్నిస్ ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొవడం జరిగేందన్నారు.పోలీసు గ్రౌండ్‌ను ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం కోసం ఇవ్వడం ద్వారా వాకింగ్ వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు.అదే విధంగా పోలీసులకు కేటాయించిన స్థలంలో చిన్నపిల్లల పార్క్,వాకింగ్ ట్రాక్,వాలీబాల్,కబడ్డీ,టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం మక్కువ ఉండటం అభినందనీయం : నరసింహచారి



అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారికి చిత్రపటాన్ని అందచేస్తున్న కృష్ణమాచారి

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 30ప్రభాతవార్త:** వృత్తి దేవాదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్,ప్రవృత్తిగా చిత్రలేఖనంగా మార్చుకున్నాడు.చిత్రకారుడిగా కాందూరి కృష్ణమాచారి తన నైపుణ్యం ద్వారా ఎన్నోఅద్భుతమైన చిత్రాలను గీస్తూ చిత్రకారుడిగా రాణిస్తున్నాడు.అయితే అసెంబ్లీ కార్యదర్శి నరసింహా చారికి ఇష్టదైవమైన నరసింహా స్వామి చిత్రపటాన్ని కృష్ణమాచారి స్వయంగా చిత్రీకరించారు.ఈచిత్రపటాని దేవాదాయశాఖ జె.ఎ.సి అధ్యక్షులు కాందూరి కృష్ణమాచారి,ప్రముఖ సింగర్ కృష్ణచైతన్య,వసంతకుమారి కలిసి వెల్లి అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారికి యాదగిరి లక్ష్మీనరసింహా చిత్రపటాన్ని బహుకరించారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ వృత్తితోపాటు కాందూరి కృష్ణమాచారి చిత్రలేఖనంపై రాణించడం పట్ల అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేటలో గంజాయి పట్టివేత



అమీర్‌పేటలో గంజాయి విక్రిస్తున్న వ్యక్తి అరెస్టు

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** అమీర్‌పేటలో గంజాయి విక్రయాలు చేస్తున్న సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన కుందన్ కుమార్ అనే వ్యక్తినిస్పెషల్ టాక్స్ పోర్స్ టీమ్ అదుపులోకి తీసుకున్నారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మంజూ ఆధ్వర్యంలో జరిగిన ఈ అపరేషన్‌లో నిందితుడి వద్ద నుండి 521 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టు బడ్డ గంజాయిని, నిందితుడిని అమీర్‌పైట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.


**LOST DOCUMENT NOTICE**

This is to inform the public that my client has informed that V. B. R. Prasad (a.k.a. Vemulapalli Babu Rajendra Prasad as per Aadhar), S/o Venkateswara Rao, has lost his link document bearing Document No. 1880/1986, dated 16th October 1986, pertaining to House No. 12-5-21/7, Vijayapuri, South Lalaguda, Secunderabad - 500017. The said document was lost near a xerox shop in Tarnaka on 23rd October 2025. If found, kindly contact: 9963329346. Issued by:

Sd/- B. Shri Hari
Advocate on behalf of his client
# H.No. 7-1-29, Flat No. B G-4,
United Avenue North End
Apt's, Leelanagar, Ameerpet,
Hyderabad-500 016.
Cell: 9963329346.


## కూకట్‌పల్లి పోస్ట్ ఆఫీస్‌లలో 24 గంటలు బుకింగ్ సేవలు అమలు

పోస్ట్ ఆఫీస్ సీనియర్ సూపర్ ఇండెంట్ అనన్యప్రియ

**కూకట్‌పల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో 24 గంటలు బు కింగ్స్ సేవలు వినియోగ దారు లకు అందించేందుకు సేవలను ప్రారంభించినట్లు సికింద్రాబాద్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ సూపర్ ఇండెంట్ ఎం అనన్యప్రియ తెలియజేశారు.కూకట్‌పల్లిలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్‌లలో 24 గంటలు సేవలను విస్తరించినట్లు చెప్పారు. ఇప్ప టినుండి ఆదివారాలతో పాటు సెలవు దినాలలో సైతం 24 గంటలు పోస్ట్ ఆఫీస్లు తెరిచి ఉంటాయని స్పష్టం చేశారు. పోస్ట్ ఆఫీస్‌లలో ఏ సమయం లోనైనా పార్సిల్‌లో, స్పీడ్ పోస్ట్ డాక్యుమెంట్లు, లెటర్ బుకింగులు, డబ్బు చెల్లింపులకు బుక్ చేసుకోవడానికి అంతరాయం లేని పోస్టల్ సేవలను ప్రారం భించినట్లు వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవాలని అనన్య ప్రియ తెలియజేశారు.


**దశదిన కర్మ**



మా అందరికీ ప్రేమానురాగాలు పంచి కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు మానుండి భౌతికంగా దూరమైనా మీ జ్ఞాపకాలు మా మదిలో సదాపదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతికలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ.... బాధాతప్త హృదయాలతో...

కుమారుడు-కోడలు: కడారి జనార్ధన్ రెడ్డి - పావనిరెడ్డి
మనుమడు: కడారి జతిన్ రెడ్డి, మనుమరాలు: కడారి బ్రిందరెడ్డి
కుమార్తెలు-అల్లుళ్లు
కె.జయమ్మ - మహేందర్ రెడ్డి, పి.సురేఖ - నవీన్ రెడ్డి
మనుమరాళ్లు: పి.సుమలత-విష్ణువర్ధన్ రెడ్డి, ఎ.రంజిత-విష్ణువర్ధన్ రెడ్డి, బి.స్రవంతి-సురేష్ రెడ్డి, రుచిత-మనిదీప్ రెడ్డి
మనుమలు: కె.అరవింద్ రెడ్డి-శ్రేయాన్సి, పి.సృజన్ రెడ్డి
మునిమనుమలు:
బి.సుచిర్ రెడ్డి, బి.క్రితిక్ రెడ్డి, ఎ.జైషవ్ రెడ్డి, బి.హావీష్ రెడ్డి
మునిమనుమరాల్లు:
పి.సమీక్ష, ఎ.వర్షిక మరియు కడారి కుటుంబ సభ్యులు

కీ॥శే॥ కడారి లక్ష్మమ్మ గారు
మాజీ సర్పంచ్, హైదర్షా కోట్
మరణం: 21.10.2025

కార్యస్థలం: తేది: 31.10.2025, శుక్రవారం మ॥ 12 గం.లకు సి వైఆర్ కన్వెన్షన్, హైదర్షాకోట్ నందు జరుపబడును.



**IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE : CITY CIVIL COURT :: AT HYDERABAD**
**O.S.NO. 1245 OF 2025**

**Between:**
1. Smt. Rudrashetty Anjani Bai W/o. Late Rudrashetty Jai Prakash & Others.
...**Plaintiffs**

**And**
1. Sri. R. Chandra Mohan S/o Shri R. Padma Rao, Aged about 66 years, Occ: Business, R/o. H.No.3-4-21, Dr. Bhoomanna Lane, Kachiguda, Hyderabad
2. The Tahsildar, Saidabad Mandal, Hyderabad, T.S.
3. To Whom so ever may concern
.....**Defendants**

To,
To Whom so ever may concern

**SUMMONS**

It is hereby take Summons that the above named Plaintiffs filed Suit for seeking relief of declaration to declare the Plaintiffs as legal heirs of deceased R. Jai Prakash consequential to Declare the Plaintiffs as Successors and Possessors of Suit Schedule Property and said case is posted on 26-11-2025 at 10.30 AM in the above mentioned court. If anybody have objection they may approach to the Hon'ble court in the above mentioned date, otherwise the matter will be decided accordingly.

**SCHEDULE OF PROPERTY**

The Suit Schedule Property i.e., 50% of Un-divided and Un-Specified land including house property bearing Municipal No.6-3-802, admeasuring 200 Sq. Yards equivalent to 168Sq. Metres (covered with 4,000-00 SFT structure situated at Yellareddyguda, Hyderabad, TS., and bounded by:: NORTH :: 30 ft Wide Road. SOUTH :: Property of Smt. D. Mala Sattamma. EAST :: 4ft wide Passage. WEST :: Portion of House of Late B. Ramchander Rao.

**(BY ORDER OF THE COURT)**
**Sd/- P.Naveen Kumar**
**Advocate**
(O) 3-1-425/1, Nimboli Adda, Kachiguda, Hyderabad, TS.



**IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE MEDCHAL – MALKAJGIRI DISTRICT, AT MEDCHAL**
**O. S. No. 358 OF 2025**

**Between:-**
1. SUGUNAVATHI JANARTHANAN, W/O LATE JANARTHANAN BALAKRISHNAN ANGIYA.
2. PRANAV JANARTHANAN ANGIYA, S/O LATE JANARTHANAN BALAKRISHNAN ANGIYA.
3. SHREE JANARTHANAN ANGIYA, D/O LATE JANARTHANAN BALAKRISHNAN ANGIYA.
(all are Resident Off : Plot No.-27, Lake Veiw Colony, Near Pragathi Nagar Lake, Bachupally Mandal, Medchal-Malkajgiri District Telangana-500090.
... **Plaintiffs**

**AND**
1. The Mandal revenue Officer, BACHUPALLY MANDAL, Medchal Malkajgiri District, Telangana.
2. To whom so it may concern
....**Defendants**

Where as the above named plaintiffs have filed the above numbered suit, praying to declare plaintiffs as Legal Heirs of Late JANARTHANAN BALAKRISHNAN ANGIYA who was died intestate on 24.12.2024, for legal status; Whereas this court ordered notice by publication in Newspaper concerning public at large and whom-so-ever concerned.
It is therefore informed that if anybody having objections with regard to the above prayer; they may put forth their objections before the above said Honorable
Court by 10:30 am on 04.12.2025, if objections are not received by then, the suit will be decreed according to law.
If any body wants information in this regard they can have such information from the advocate whose particulars re mentioned hereunder.

**(BY ORDER OF THE COURT)**
G SRIDHAR, D RAMESH
ADVOCATES,
OFFICE AT H.No 3-157
PRAGATHI NAGAR
Medchal, M – M District
Mobile No. 9666600082
COUNSELS FOR PLAINTIFFS



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC), NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD.**
**ABR/CF NO. 30 OF 2025.**

**Between:**
M/S. SHRIRAMCHANDRA CHITS PRIVATE LIMITED, having its Registered Office at #9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003. Represented by its Foreman Mr. P.Manga Rao, S/o. P.Subbaiah, Aged about 48 Yrs., R/o Flot.No.207, 2nd Phase, Block-A, Sri ThirumalaMilinuem, HCL Nagar, Mallapur, Hyderabad.
....**DISPUTANT**

1. Sri.G.Samba Siva Rao, S/o. G.Srinu, Aged about 53 Yrs., Occ: Machinist, Per No.21061, Ordnance Factory, Eddumailaram, Medak. R/o.H.No.6-100/2/8, Patancheru, Sanga Reddy.
2. Sri.M.Naveen Kumar, S/o. M.Rajendra, Aged about 51 Yrs., Occ: Millwrigh, Pes No.19563, Ordnance Factory, Eddumailaram, Medak. R/o. Q.No.3602, Ordinance Factory Quarters, Sanga Reddy.
3. Sri.M.Kartik Kishore, S/o. M.Karunakar, Aged about 38 Yrs., Occ: Moulder, Pes.No.26573, Ordnance Factory, Eddumailaram, Medak. R/o. H.No.Q.No.2898, Ordinance Factory Quarters, Sanga Reddy.
4. Sri.L.Tukaram, S/o. L.Bheemla, Aged about 53 Yrs., Occ:P.S., Pes.No.919129, Ordnance Factory, Eddumailaram, Medak. R/o. Q.No.4071, Ordinance Factory Quarters, Sanga Reddy.
5. Sri.Raju Devender, S/o. Muthu Swamy Raju, Aged about 43 Yrs., Occ: Sci.Asst."B", Emp.No.00000040, O/o. Indian National Central for Occan information Service, Ministry of Earth Science, Govt of India, Pragathi Nagar, Nizampet, Hyderabad-500090. R/o. Plot.No.63, Bachupally, Hyderabad.
....**OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.4,54,457/-. The above claim petition is posted to dated 15-11-2025 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defense if any at 12.00A.M. to 2.00 P.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER"**
**(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**Smt.P.S.N Padma,**
Advocate,
#9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003.



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC), NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD.**
**ABR/CF NO. 33 OF 2025.**

**Between:**
M/S. SHRIRAMCHANDRA CHITS PRIVATE LIMITED, having its Registered Office at #9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003. Represented by its Foreman Mr. P.Manga Rao, S/o. P.Subbaiah, Aged about 48 Yrs., R/o.Flot.No.207, 2nd Phase, Block-A, Sri ThirumalaMilinuem, HCL Nagar, Mallapur, Hyderabad.
....**DISPUTANT**

1. Smt.J.Rupa Devi, W/o.J.B.T. Bhushanam, Aged about 41 Yrs., Occ: I.T.Holder, R/o.H.No.5-1-57/31/4, Mallapur, Hyderabad-500076.
2. Sri.E.Venkatesh, S/o. E.Sathaiah, Aged about 41 Yrs., Occ: IT Holder, R/o. H.No.3-75, Cholleru, Yadagirigutta, Yadadri Bhovaniri District.
3. Sri.P.VenkateshGoud, S/o. P.Sathaiah Goud, Aged about 50 Yrs., Occ:Driver(S.G), O/o. Central Power Research Institute, UHV Research Laboratory, Warangal Highway, Medipally Village, Uppal, Hyderabad-500098. R/o. Type-II, Q.No.9, CPRI, Medipally, Hyderabad.
4. Sri.K.Kodandapani, S/o. K.Sunkonna, Aged about 53 Yrs., Occ: Multi-Tasking Staff Gr-III, O/o. Central Power Research Institute, UHV Research Laboratory, Warangal Highway, Medipally Village, Uppal, Hyderabad-500098. R/o.H.No.9-112/1/12, CPRI, Medipally, Hyderabad.
5.Sri.J.B.T.Bhushanam, S/o. J.Rama Rao, Aged about 50 Yrs., Occ: IT Holder, R/o. H.No. 5-1-57/31/4, Mallapur, Hyderabad-500076.
...**OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.6,65,466/-. The above claim petition is posted to dated 15-11-2025 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defense if any at 12.00 A.M. to 2.00 P.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER"**
**(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**Smt.P.S.N Padma,**
Advocate,
#9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003.



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC), NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD.**
**ABR/CF NO. 32 OF 2025.**

**Between:**
M/S. SHRIRAMCHANDRA CHITS PRIVATE LIMITED, having its Registered Office at #9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003. Represented by its Foreman Mr. P.Manga Rao, S/o. P.Subbaiah, Aged about 48 Yrs., R/o.Flot.No.207, 2nd Phase, Block-A, Sri ThirumalaMilinuem, HCL Nagar, Mallapur, Hyderabad.
....**DISPUTANT**

1. Sri.K.Srinivasa Rao, S/o. K.K.Kalyana Rao, Aged about 52 Yrs., Occ:Private Employee as Marketing Executive, O/o. Plot.No.A-28/1/12, IDA, Nacharam, Hyderabad-500076. R/o. H.No.11-12-223/A, Saroornagar, Hyderabad.
2. Sri.P.Prabhakar Rao, S/o. P.Venkateshwar Rao, Aged about 49 Yrs., Occ: Central Govt. Emplyee as Sr.Tech(C & W), Emp.No.24211501261, Bill Unit.No.0905512, S.C.Rly., Machirial, Nizamabad. R/o. H.No.476/1, Chilkalguda, Secunderabad.
3. Sri.S.Prem Kumar, S/o. S.Gananaiah, Aged about 57 Yrs., Occ: Govt. Employee as School Assistant, Emp.No.1426537, O/o. ZPHS, Athvelly, Medchal.R/o. H.No.1-49/23/6A, Uppal, Hyderabad.
4. Sri.Ch.Prabhakar, S/o. Ch.Moses, Aged about 49 Yrs., Occ: Central Govt.Employee as TMM-II, Emp.No.24311030118, Bill Unit.No.0906221, O/o. Engineering Department, S.C.Rly., Manchirial, Nizamabad. R/o. H.No.10-3-162/39GF, East Marredpally, Secunderabad.
....**OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.2,99,856/-. The above claim petition is posted to dated 15-11-2025 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defense if any at 12.00 A.M. to 2.00 P.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER"**
**(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**Smt.P.S.N Padma,**
Advocate,
#9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003.



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR (FAC), NEAR NEILOFER HOSPITAL, RED HILLS, HYDERABAD.**
**ABR/CF NO. 31 OF 2025.**

**Between:**
M/S. SHRIRAMCHANDRA CHITS PRIVATE LIMITED, having its Registered Office at #9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003. Represented by its Foreman Mr. P.Manga Rao, S/o. P.Subbaiah, Aged about 48 Yrs., R/o.Flot.No.207, 2nd Phase, Block-A, Sri ThirumalaMilinuem, HCL Nagar, Mallapur, Hyderabad.
....**DISPUTANT**

1. Sri.K.Srinivasa Rao, S/o. K.K.Kalyana Rao, Aged about 52 Yrs., Occ:Private Employee as Marketing Executive, O/o. Plot.No.A-28/1/12, IDA, Nacharam, Hyderabad-500076. R/o. H.No.11-12-223/A, Saroornagar, Hyderabad.
2. Sri.Ch.Prabhakar, S/o. Ch.Moses, Aged about 49 Yrs., Occ: Central Govt.Employee as TMM-II, Emp.No.24311030118, Bill Unit.No. 0906221, O/o. Engineering Department, S.C.Rly., Manchirial, Nizamabad. R/o. H.No.10-3-162/39GF, East Marredpally, Secunderabad.
3. Sri.P.Prabhakar Rao, S/o. P.Venkateshwar Rao, Aged about 49 Yrs., Occ: Central Govt. Emplyee as Sr.Tech(C & W), Emp.No. 24211501261, Bill Unit.No. 0905512, S.C. Rly., Machirial, Nizamabad. R/o. H.No.476/1, Chilkalguda, Secunderabad.
4. Sri.M.B.Srinivas, S/o. M.B.Narsaimha, Aged about43 Yrs., Occ: Govt. Employee as Office Subordinate, Emp.No.1463952, GPF No.110051189315, O/o. ZPHS, UppalKalan, Uppal Bus Stop, Uppal, Hyderabad. R/o. H.No.1-52/1, Lingampally, Medak.
5.Sri.S.Prem Kumar Abel, S/o. S.Gananaiah, Aged about 57 Yrs., Occ: Govt. Employee as School Assistant, Emp.No.1426537, O/o. ZPHS, Athvelly, Medchal.R/o. H.No.1-49/23/6A, Uppal, Hyderabad.
....**OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of Rs.3,96,696/-. The above claim petition is posted to dated 15-11-2025 for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defense if any at 12.00 A.M. to 2.00 P.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

**"BY ORDER"**
**(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)**
**Smt.P.S.N Padma,**
Advocate,
#9-1-164/S-9, II Floor, Amsri Plaza, S.D.Road, Secunderabad-500003.

## రక్తదానంతో అమరవీరులకు నివాళి

**: రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు**



**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, అక్టోబర్ 30 (ప్రభాతవార్త):** పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు మాల్కాజ్‌గిరి జోన్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్లు, ప్రసాద్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మల్లాపూర్ నాచారం వీఎన్ఎస్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో 529 మంది సివిల్ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొని రక్తదానం చేశారు అని సిపి సుధీర్ బాబు పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజ సేవలో భాగస్వాములు కావడం ద్వారా వారి స్ఫూర్తిని కొనసాగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అధికారులు రక్తదానం ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరూ ఈ మహత్తర సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి డీసీపీ మాల్కాజ్‌గిరి జోన్ శ్రీమతి పి.వి. పద్మజ, ఐపీఎస్, ఏసీపీ మాల్కాజ్‌గిరి డివిజన్ శ్రీ ఎస్. చక్రపాణి, ఏసీపీ కుషాయిగూడ డివిజన్ శ్రీ వై. వెంకటరెడ్డి, మాల్కాజ్‌గిరి జోన్‌కి చెందిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం



**నేరెడ్ మెట్, అక్టోబర్ 30 (ప్రభాతవార్త):** సైనిక్‌పురి వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. తిరుకల్యాణం అనంతరం దేవస్థాన పాలక మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో 300 మందికి పైగా భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ...ప్రతి నెలా శ్రవణ నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం నిర్వహించడం భక్తులకు ఆధ్యాత్మిక పండుగలాంటిదే. ఈ ఉత్సవం మరింత భక్తిశ్రద్ధలతో సాగి సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, అనేక మంది భక్తులు హాజరయ్యారు. భక్తులు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించి దివ్య ఆశీస్సులు పొందారు.

## బిఆర్ఎస్‌కే చిరు వ్యాపారుల మద్దతు

**-తోట మహేష్ యాదవ్**



ఓటు అభ్యర్థిస్తున్న మహేష్ యాదవ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 30 (ప్రభాతవార్త):** చిరు వ్యాపారస్తుల పూర్తి మద్దతు డిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతకే ఉందని హోటల్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. జుబ్లీహిల్స్ నియోజకవర్గంలోని చిరు వ్యాపారులను, హోటల్ కార్మికులను వ్యక్తిగతంగా కలిసి మాగంటి సునీతను గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటును అభ్యర్థించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సునీత విజయానికి చిరు వ్యాపారస్తుల సహాయ సహకారాలు ఉండాలని కోరారు. మీ అందరూ కలిసికట్టుగా సహకరించి, కారు గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. సునీత విజయం అంటే చిరు వ్యాపారుల అభివృద్ధి కార్మికుల సంక్షేమానికి బాట అని అన్నారు.

### నేడు పోచమ్మ అమ్మవారి దేవాలయం శంకుస్థాపన



పోచమ్మ అమ్మవారు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** శ్రీపోచమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాగోల్ డివిజన్ జైపురి కాలనీలోని శ్రీపోచమ్మ అమ్మవారి దేవాలయ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని 31వ తేదీ శుక్రవారం ఉదయం 10.36 గంటలకు పేద పండితుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్, నాగోల్ మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య తెలిపారు. దశాబ్దాల క్రితం నాటి పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని ఆధునికరించడంలో భాగంగా పునర్నిర్మాణం చేస్తున్నట్లు మైసయ్య తెలిపారు. అమ్మవారి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమా నికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేత

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్‌కు చెందిన ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను కాంగ్రెస్ పార్టీ డిసిప్లినరి కమిటి ఎత్తివేసింది. మలక్‌పేట బి బ్లాక్ అధ్యక్షుడు ఆమిందాల మదన్‌బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంట్ల కృష్ణలపై కాంగ్రెస్ పార్టీ గతంలో సస్పెన్షన్‌ను విధించింది. అయితే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపిన తర్వాత వీరిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ పార్టీలో కొనసాగుతారని డిసిప్లినరి కమిటి వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ ప్రకటించారు.

# రాక్ టౌన్ సొసైటీ ఎన్నికలు రద్దు చేయండి



ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

**మన్సు రాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని రాక్ టౌన్ కాలనీలో నవంబర్ 16న జరుపతలపెట్టిన కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలను రద్దు చేయాలని పలువురు సొసైటీ సభ్యులు ఎన్నికల అధికారిని కోరారు. సొసైటీ ఓటర్ల జాబితాను సవరించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సొసైటీ సభ్యులు మామిడి సోమయ్య, కృష్ణమోహన్ రెడ్డి, ఆల రవీందర్ రెడ్డి, కల్వకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, సీతారాంరెడ్డి, కొండల్ రెడ్డి, ఇంద్రారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు మరోసారి సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి చతుర్వేదిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సొసైటీ సభ్యులలో ఓటు వేయడానికి అర్హత ఉన్న సభ్యులతో కాకుండా అర్హత లేని మొత్తం సభ్యులతో ఓటర్ల జాబితాను రూపొందించి, అదే ఓటర్ల జాబితాగా ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారని ఆరోపించారు. ఓటర్ల జాబిత పూర్తిగా తప్పుల తడకగా ఉందని, వెంటనే జాబితాను సవరించాలని తాము ఇప్పటికే రెండు సార్లు కోరామని, అయినా జాబితాను సవరించకుండా జాప్యం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. సొసైటీలో దాదాపు 863 మంది ఓటర్లు ఉండగా వీరిలో చాలా మంది ఓటర్లు కాదనితెలుస్తుందని, చాలామంది ఓటర్ల చిరునామాలు, ఫోన్ నెంబర్లు లేవని ఆరోపించారు. అంతే కాకుండా స్థానిక అడ్రస్‌లో లేని ఓపెన్ ప్లాట్ యజమానులైన ఓటర్లను గుర్తించేందుకు ఎటువంటి ఆధారం లేకుండా బోగస్ ఓటర్లతో ఓట్లు దండుకునే అవకాశం ఉందని, అలాంటి ఓటర్ల స్థానికతను నిరూపించే గుర్తింపు పత్రాల ను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను సవరించి సొసైటీ ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్పటి దాకా ఎన్నికలు నిలిపివేయాలని వారు కోరారు.

# పోలీస్ మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన



రక్తదానం చేసిన వారితో డీసీపీ పద్మజ ఇతర అధికారులు

**నాచారం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, డీసీపీ పద్మజ ఆదేశాల మేరకు గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాల్కాజ్‌గిరి జోన్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్ల సిబ్బంది కలిసి ప్రసాద్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 529 మంది సివిల్ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొని రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజానికి సేవ చేయడం ద్వారా వారి స్ఫూర్తిని కొనసాగించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పోలీసు అధాకారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మల్కాజిగిరి డీసీపీ పీ.వీ పద్మజ, ఏసీపీలు చక్రపాణి, వై. వెంకటరెడ్డితో కలిసి రక్తధాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వారం అవుతామన్నారు. ఆపద సయమాల్లో రక్తం దొరకక ఎంతో మంది ఇబ్బందులు పడుతారని అలాంటి వారిని ఆదుకునేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛందంగా వందలాది మంది పోలీసులు, యువత పాల్గొని రక్తదానం చేయడం ఎంతో సంతోషాన్ని కల్గిస్తుందన్నారు. హబ్సిగూడలోని ఐఐహెచ్ఎంసీఏ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్, యూత్ నాయకులు అరుణ్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువత రక్త దానం చేశారు. రక్తదానం చేసిన అందరికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం ఇన్స్‌పెక్టర్ ధనుంజయగౌడ్, ఉప్పల్ ఇన్స్‌పెక్టర్ కె. భాస్కర్, డిఐ రామలింగా రెడ్డి, ఎస్సైలు వెంకటయ్య, ప్రభాకర్ రెడ్డి, మైబెల్లి, మేడిపల్లి ఎస్సైలు రవి, తిరుపతితో పాటు మాల్కాజ్‌గిరి జోన్‌కు చెందిన అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ బండ్లగూడలోని పంచాయతన సహిత సీతారామాంజనేయ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ బృందములో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ. శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాసన్నిధానం వారి అశీస్సులతో శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారు విచ్చేసి తమ కరకమలములతో పంచాయతని సహిత రామాలయమునకు సంబంధించి శ్రీ సీతారామాంజనేయ, స్పటికలింగ, శారదామాత, ఆదిత్య, గణపతి విగ్రహమూర్తులనూ దత్తాత్రేయ ఆదిశంకరాచార్య మూర్తులకూ ప్రతిష్ఠాపనా మహోత్సవము కుంభాభిషేకము చేయడం జరిగిందన్నారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ జంధ్యాల వేంకటేశ్వరులు, బ్రాంచ్ హెడ్ జొన్నలగడ్డ రామకృష్ణ, కోశాధికారి శిష్టా సుబ్బారాయుడు, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ బృంద కార్యవర్గము వేంకటేశ్వరులు, ఇంగువ భాస్కర నారాయణ శర్మ, శుద్ధపల్లి శ్రీనివాస ప్రసాద్, భాస్కర చారి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి పైప్‌లైన్ల డయాను పెంచండి : సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట్ ఎజిఆర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో కమీషనర్ సరస్వతి తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ బడంగ్‌పేట్ ఎజిఆర్ కాలనీలో డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం పైప్‌లైన్ల డయాను పెంచాలని మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. డ్రైనేజీ సమస్యలతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆమె గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పి.సరస్వతి, డిఇఇ వెంకన్న తదితరులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె డ్రైనేజీ సమస్యలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కాలనీలో తరచుగా డ్రైనేజీ సమస్యలు నెలకొంటున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పాత డ్రైనేజీ పైపుల స్థానంలో పెద్ద దయా గల పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని కమీషనర్, డిఇఇలను ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో కాలనీలో డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, 30వ డివిజన్ బిఆర్ఎస్ ముఖ్య నాయకుడు భీమిడి జంగారెడ్డి, బడంగ్‌పేట్ గ్రామ నాయకులు కర్రె బల్వంత్, పుట్టగళ్ళ సంతోష్, పెద్దబావి మహేందర్‌రెడ్డి, ఎర్రబట్టు శ్రీనివాసరాజు, ఎజిఆర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు ప్రమోద్‌లతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో సిసి రోడ్డు ప్రారంభం

### పాల్గొన్న మాజీ మేయర్ అమర్ సింగ్ , ఎర్ర ఐలేష్ యాదవ్



పిర్జాదిగూడ కార్పొరేషన్ ఎనిమిదో డివిజన్లో సిసి రోడ్లు ప్రారంభిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్ ,ఎర్ర ఐలేష్ యాదవ్ ,బండి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి , అక్టోబర్ 30 ప్రభాతవార్త ;** శ్రీశ్రీనగర్ లో సుమారు 40 లక్షల సిసి రోడ్ల ప్రారంభోత్సవానికి మాజీ మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ఎనిమిదవ వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్ర ఐలేష్ యాదవ్, బండి శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, సుధాకర్, నంద కిశోర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, గిరి బాబు రఘురామ్ , తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సిని డిసెంబర్ 9 లోపు ప్రకటించాలి

### -ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి




**అత్తాపూర్ అక్టోబరు30, ప్రభాతవార్త :** పిఆర్‌సిని డిసెంబరు9లోపు ప్రభుత్వం ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అల్టిమేటం జారి చేశారు. బుధవారం రాత్రి మైలార్‌దేవ్‌పల్లి అమ్మ ఫంక్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా పిఆర్‌టియూ సర్వసభ్య సమావేశాన్ని రంగారెడ్డి జిల్లా పిఆర్టియు అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్దమారు రాఘవేందర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి సభని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూల వైఖరి వహించాలని జూలై 2023 నుండి రావలసిన పిఆర్‌సిని 28 నెలల గడచిన నేటి వరకు అతిగతి లేదని కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పిఆర్సిని ప్రకటించాలని లేదంటే డిసెంబర్ 9 తర్వాత ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని అన్నారు. అలాగే ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను తొలగించి సీనియర్ ఉపాధ్యాయులకు భయాందోళనలకు దూరం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులన్నీ తక్షణమే చెల్లించాలని పెన్షన్ దారుల కు సంబంధించిన అన్ని బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కోరారు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ముందుగా స్పందించే సంఘం మన పిఆర్టియునే నని, కాబట్టి ప్రతి ఉపాధ్యాయుడు పిఆర్‌టియులో సభ్యత్వం ఇచ్చి సంఘం బలోపేతంలో భాగస్వాములు కావాలని కోరారు కార్యక్రమంలో జిల్లా మాజీ పిఆర్టియు జిల్లా మాజీ అధ్యక్షులు కన్నయ్య గారి గోవర్ధన్ యాదవ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అరుణ సురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలో వరద నీటి కాలువకు సంబంధించిన దెబ్బతిన్న స్లాబ్‌ను పునర్నిర్మాణం చేసే పనులను రూ.28 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే పనులకు గురువారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం తక్షణమే ఈ పనులను ప్రారంభించామన్నారు. మౌలిక వసతులు, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నాగోల్ డివిజన్‌లో ప్రతి సమస్యను దశల వారీగా పరిష్కరిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నగర్ కాలనీ అధ్యక్షులు గణేష్ యాదవ్, సభ్యులు రమేష్, యాదగిరి, హనుమంతరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రారంభం



ఎమ్మెల్యే చేతులు మీదుగా బ్యాంకు ఖాతా పాసుపుస్తకాన్ని అందుకుంటున్న నాళ్ళ శ్రీనివాస్‌గుప్త

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు గురువారం ప్రారంభమైంది. స్థానిక పాత గ్రామ పంచాయతీ సర్కిల్ సమీపంలో ఏర్పాటైన ఈ బ్యాంకును మాజీ మంత్రి, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె బ్యాంకులో కొత్తగా ఖాతాలు తెరిచిన వారికి పాసు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మాజీ సర్పంచ్ సూర్ణగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి మహేందర్‌రెడ్డి, నాయకులు కర్రె బల్వంత్, పుట్టగళ్ల సంతోష్, ఎర్రబట్టు శ్రీనివాసరాజులతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## మామిడిపల్లికి ఆర్టీసి బస్సు సర్వీసులను కల్పిస్తాం: కెఎల్ఆర్



ఆర్టీసి బస్సు సర్వీసుల కోసం కెఎల్ఆర్‌ను కలిసిన మామిడిపల్లి నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న మహేశ్వరం నియోజకవర్గంలోని మామిడిపల్లి గ్రామానికి స్థానిక ప్రజల సౌకర్యార్థం ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పిస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొంటూ స్థానిక మామిడిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం కెఎల్ఆర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ మేరకు స్పందించిన ఆయన ఆర్టీసి అధికారులకు ఫోన్ చేసి బస్సు సౌకర్యం విషయమై మాట్లాడారు. త్వరలో బస్సు సర్వీసులను ప్రారంభించాలని ఆయన వారిని కోరారు. కెఎల్ఆర్‌ను కలిసిన వారిలో స్థానిక టెంపుల్ కమిటీ, ఇందిరమ్మ కమిటీ నాయకులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## నాదర్‌గుల్‌లో ఆరోగ్యంపై ఎన్ఎస్ఎస్ అవగాహన ర్యాలీ




నాదర్‌గుల్‌లో ర్యాలీని నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీని నిర్వహించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిచే బిపి, షుగర్, సిబిపి, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రసాద్, ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మయ్యలతో పాటు కాలేజీ లెక్చరర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 17వ డివిజన్‌లో హై టెన్షన్ రోడ్డును పరిశీలించిన మాజీ డిప్యూటీ మేయర్



ఫిర్జాదిగూడ కార్పొరేషన్ లో హై టెన్షన్ రోడ్డును పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ,

**మేడిపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త ;** పిర్జాదిగూడ 17వ వార్డులోని హై టెన్షన్ రోడ్డు అభివృద్ధికి నోచుకోక గత కొంతకాలంగా వివిధ కాలనీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న ఆ రోడ్డు పరిస్థితిని మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే దానికి కావాల్సిన నిధుల కొరకు హెచ్ఎండిఏ అధికారులను సంప్రదించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హెచ్ఎండిఏ నిధులతో పూర్తిస్థాయి సిసి రోడ్డును హరిణి మాన్సన్ నుండి వినాయక నగర్ వరకు రోడ్డు వేయడానికి సర్వే పనులు ప్రారంభించడం జరిగినది. లేక్ వ్యూ కాలనీ, విష్ణుపురి కాలనీ, వినాయక నగర్ కాలనీ అనుబంధ రోడ్డు కాలనీవాసులు సిసి రోడ్డుతో జరిగే అభివృద్ధి కోసం ఇబ్బందులు అన్నీ తొలగినట్టే అని హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు అభివృద్ధికి తోడ్పడిన కుర్ర శివకుమార్ గౌడ్ కు కాలనీవాసుల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మహిళకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి